సాక్షి
కామారెడ్డి
బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



దోషులను తప్పిస్తున్నారు

ప్రశ్నపత్రాల లీకేజీలపై జిల్లాకేంద్రంలో ఎన్ఎస్‌యూఐ, ఏబీవీపీల ఆధ్వర్యంలో వేరువేరుగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

- 8లో ▸



కేసీఆర్ నాయకత్వంలోనే..

కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి చెందుతోందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.2 /22.1

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:35	గురు : 4:44



బీర్కూర్ మండలంలో నేలకొరిగిన వరి పంట (ఫైల్)



బస్వన్నపల్లిలో నేల కొరిగిన మక్క(ఫైల్)



తాడ్వాయి మండలం కరడ్‌పల్లిలో నేలకొరిగిన గోధుమ పంట(ఫైల్)

పంట నష్టం.. పిసరంతేనట!

ఇటీవల విరుచుకుపడిన ఈదురుగాలులు, వడగళ్ల వానతో జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చేతికందిన పంట దెబ్బతినడంతో అన్నదాతలు లబోదిబోమన్నారు. అయితే అధికారులు 14 ఎకరాల్లో మాత్రమే పంటలు దెబ్బతిన్నట్లు తేల్చడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. అడ్డగోలు నిబంధనలతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో వడగళ్లతో దెబ్బతిన్న పంటలు
- 14 ఎకరాలే చూపించిన అధికారులు
- అడ్డగోలు నిబంధనలతో లెక్కలోకి రాని నష్టం
- ఆందోళనలో బాధిత రైతులు



వంద్రికల్‌తండాలో రాలిన మామిడి(ఫైల్)

సాక్షి, కామారెడ్డి: అకాల వర్షాలతో జిల్లాలోని పలు ప్రాంతాలలో పంటలు దెబ్బతిన్నాయి. గత నెల 18, 19 తేదీలలో లింగంపేట, గాంధారి, సదాశివనగర్, దోమకొండ, భిక్కనూరు, రాజంపేట, నిజాంసాగర్, జుక్కల్ తదితర మండలాల్లో ఈదురుగాలలతో కూడిన వర్షం కురిసింది. పలు ప్రాంతాలలో వడగళ్లు పడ్డాయి. దీంతో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చాలాచోట్ల మొక్కజొన్న పంట నేలవాలింది. వడగళ్లతో వరికి తీవ్ర నష్టం వాటిల్లింది. 980 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తీరా క్షేత్ర స్థాయి పరీక్షలన అనంతరం 14.15 ఎకరాల్లోనే పంట నష్టం జరిగిందని తేల్చారు.

33 శాతంపైన దెబ్బతింటేనే..

వడగళ్లు, ఈదురుగాలులతో దెబ్బతిన్న పంటలకు సంబంధించి నష్టం అంచనా వేయడానికి వ్యవసాయ శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. వాటి ఆధారంగా జిల్లాలో వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. 33 శాతానికిపైగా దెబ్బతిన్న వాటినే గుర్తించాలన్న ఆదేశాలతో అధికారులు సర్వే చేపట్టారు. దీంతో జిల్లాలో కేవలం 13 మంది రైతులకు సంబంధించి 14.15 ఎకరాలు మాత్రమే దెబ్బతిన్నట్లు తేల్చారు. సర్కారు విధించిన నిబంధనలతో చాలామంది రైతులకు పరిహారం అందకుండా పోయింది.



వడ్లం శివారులో నేలకొరిగిన మక్క(ఫైల్)



మర్కల్ శివారులో దెబ్బతిన్న మక్క(ఫైల్)

పరిహారంపై ఆశలు ఆవిరి..

రాష్ట్రంలో ఐదారేళ్లుగా అకాల వర్షాలు, వడగళ్లకు దెబ్బతిన్న పంటలకు పరిహారం అందడంలేదు. గతనెలలో రాష్ట్రంలో వడగళ్ల వానలు పడ్డాయి. సీఎం కేసీఆర్ కొన్ని జిల్లాలలో పర్యటించి, పంట నష్టాన్ని పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేల పరిహారం అందిస్తామని ప్రకటించారు. సీఎం ప్రకటన బాధిత రైతుల్లో ఆశలు పెంచింది. తమకు సాయం అందుతుందని ఆశించారు. క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన వ్యవసాయ శాఖ అధికారులకు దెబ్బతిన్న పంటలను చూపించారు. అయితే వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో నిబంధనల ప్రకారం జరిపిన సర్వేలో 14.15 ఎకరాల్లో మాత్రమే పంటలు దెబ్బతిన్నట్టు తేల్చారు. పంట నష్టం అంచనా రూ.1.43 లక్షలుగా నిర్ధారించారు. అకాల వర్షాలే కాదు.. సర్కారు విధించిన అడ్డగోలు నిబంధనలు కూడా తమను ముంచాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటకు పరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

కోర్టులో ఆరోగ్య శిబిరం



కామారెడ్డి టౌన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కామారెడ్డి జిల్లా కోర్టులో ఆరోగ్య శిబిరం, న్యాయచైతన్య సదస్సు నిర్వహించారు. ఆరోగ్య శిబిరంలో సీపీఆర్ గురించి అవగాహన కల్పించారు. న్యాయ చైతన్య సదస్సులో భాగంగా చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి, న్యాయమూర్తులు కిరణ్‌కుమార్, వెంకటేశ్, డాక్టర్ శిరీష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, న్యాయవాదులు చంద్రసేన్‌రెడ్డి, భరత్‌కుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి కూలీలు ఐదు గంటలు పని చేయాలి'



రామారెడ్డి: ఉపాధి కూలీలు 5 గంటలపాటు పని చేయాలని డీఆర్డీవో సాయన్న సూచించారు. మంగళవారం ఆయన గోకుల్ తండా, మద్దికుంట గ్రామాలలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలిచ్చారు. ఆయన వెంట ఎంపీడీవో విజయకుమార్, ఎంపీవో ధర్మారెడ్డి తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిందే'



కామారెడ్డి టౌన్: కేంద్ర, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందని, ప్రజా క్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిందేనని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. పరీక్ష పత్రాల లీకేజీలతో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. నియంత పాలన సాగిస్తున్న కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తంబాకుల చంద్రకళ, సుమ, ప్రియ, నాగరాణి, ఫరీదాబేగం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటివెలుగు



కామారెడ్డి టౌన్: జిల్లాలో మంగళవారం కంటి వెలుగులో 5,326 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 659 మందికి కంటి అద్దాలను అందించారు. జిల్లాలో ఇప్పటివరకు 2,75,040 మందికి కంటి పరీక్షలు చేసి, 24,550 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని వైద్యాధికారులు తెలిపారు.

సీహెచ్‌సీ తనిఖీ

తాడ్వాయి: ఎర్రాపహాడ్‌లోని నర్సరీ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లను మంగళవారం అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తనిఖీ చేశారు. సీహెచ్‌సీలో మహిళలకు ఎనిమిది రకాల పరీక్షలు చేస్తున్నారా లేదా అన్న వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. అన్నిరకాల మొక్కలను పెంచాలని, నిర్వాహకులకు సూచించారు. జూన్ వరకు మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎంపీడీవో రాజ్‌వీర్, వైద్యులు నజీర, పావని, ఎంపీవో ఉన్నారు.

బీఎస్పీని బలోపేతం చేస్తున్నాం



పిట్లంలో మాట్లాడుతున్న రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్

- రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్

పిట్లం: తెలంగాణలో గ్రామగ్రామాన బీఎస్పీని బలోపేతం చేస్తున్నామని ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్ పేర్కొన్నారు. మంగళవారం పిట్లంలోని రాజరాజేశ్వర గార్డెన్‌లో బీఎస్పీ జుక్కల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఎవరూ సంతోషంగా లేరన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలతో నిరుద్యోగులు ఆవేదనలో ఉన్నారన్నారు. పేదల బతుకులు మారాలంటే బీఎస్పీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

తెలంగాణలో విచ్చలవిడి దోపిడీ జరుగుతోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దోచుకున్నట్లే కేసీఆర్ తెలంగాణను దోచుకుంటున్నారని ఆరోపించారు. పదో తరగతి పరీక్షలు కూడా సరిగా నిర్వహించలేని విద్యాశాఖ మంత్రి అవసరమా అని ప్రశ్నించారు. 80 వేల ఉద్యోగాల ప్రకటన చేసి దొంగచాటుగా ఒక్కో ఉద్యోగాన్ని అమ్ముకున్నారని ఆరోపించారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు జూనియర్ అసిస్టెంట్ పరీక్షలోనూ చాలా అవకతవకలు జరిగాయన్నారు. దీనిపై ప్రశ్నించిన బీఎస్పీ నాయకులను సూర్యాపేటలో అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. టీఎస్పీఎస్సీ బోర్డు బోర్డు చైర్మన్, సభ్యులను తొలగించపోతే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుపేదలకు ఎకరం భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు బాలరాజు, నాయకులు గొల్ల సతీష్, అబ్రార్ హుస్సేన్, వసంత, సాయిలు, ప్రజ్ఞాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలపై అవగాహన కల్పించండి'

బిచ్కుంద: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార కార్యకర్తలను కోరారు. మంగళవారం బిచ్కుందలో 'పల్లెపల్లెకు ఓబీసీ.. ఇంటింటికి బీజేపీ' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓబీసీ విద్యార్థులకు సైనిక్, నవోదయ, కేంద్రీయ విద్యాలయాల్లో 27 శాతం రిజర్వేషన్ అమలు చేస్తోందన్నారు. అలాగే ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తోందన్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వం దానిని 10 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. బీసీలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండా అన్యాయం చేస్తోందన్నారు. బీసీ కేటగిరిలో ఉన్న ముస్లింలు, క్రిస్టియన్లకు వందశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఇతర బీసీలను మాత్రం ఆంక్షలతో వేధిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూనే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని ఎత్తిచూపాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మురళి, మండల అధ్యక్షుడు కిష్టారెడ్డి, నాయకులు శ్రీధర్ పంతులు, గోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.



బిచ్కుందలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- శాంతి కమిటీ సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: హనుమాన్ జయంతి, రంజాన్ పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం కామారెడ్డిలోని ఎస్పీ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, మత పెద్దలు, సంఘాల ప్రతినిధులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహించే శోభాయాత్రలో సమయపాలన పాటించాలన్నారు. పండుగల సమయంలో సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేయవద్దని సూచించారు. పండుగలను ప్రశాంతంగా జరుపుకుంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్ష కేంద్రంలోకి అధికారులు సెల్‌ఫోన్‌లు తీసుకెళ్లొద్దు
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు..
- వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



వీసీలో పాల్గొన్న జిల్లా అధికారులు

కామారెడ్డి టౌన్: ఎస్సెస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే శాఖలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, విద్యాశాఖ అధికారులతో పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. పరీక్షలు జరిగే సమయంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ అధికారులు పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లతో వెళ్లరాదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లానుంచి ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు వెంకటేశ్ ధోత్రే, చంద్రమోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, రాష్ట్ర పరిశీలకుడు మదన్‌మోహన్, జిల్లా పరీక్షల విభాగం అధికారి నీలి లింగం పాల్గొన్నారు.

25 మంది గైర్హాజరు

కామారెడ్డి టౌన్: జిల్లాలో పదోతరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 63 ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించారు. 11,899 మంది విద్యార్థులకుగాను 11,874 మంది పరీక్షకు హాజరయ్యారు. 25 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హాజరు శాతం 99.78గా నమోదయ్యింది. సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి పరీక్ష కేంద్రాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పరిశీలించారు. పరీక్షలను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తాడ్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తెలుసుకున్నారు. డీఈవో ఎస్.రాజు, పరీక్షల నిర్వహణ అధికారి నీలం లింగం పరీక్షలను పర్యవేక్షించారు.



సదాశివనగర్‌లో హాజరు వివరాలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

పరీక్ష కేంద్రాల తనిఖీ..

సదాశివనగర్: ఎస్సెస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంతో పాటు అడ్లూర్ ఎల్లారెడ్డిలోని టెస్ట్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్‌కు సూచించారు.

సదాశివనగర్‌లో కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్కరికి కంటిపరీక్షలు చేయాలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ ధన్వాల్ తదితరులు ఉన్నారు.

'ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత'

బాన్సువాడ రూరల్: తెలంగాణ ప్రభుత్వం దేవాలయాలు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జక్కల్‌దానితండాలో జగదాంబమాత, సేవాలాల్ మందిరాల వద్ద ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహించిన భోగ్‌బండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ డివిజన్ అధ్యక్షుడు మోహన్‌నాయక్, సర్పంచ్ సంగ్యానాయక్, నాయకులు అంజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, బన్సీనాయక్, రతన్, రూప్‌సింగ్, రవి, బోడ చందర్, ధరావత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న స్పీకర్ పోచారం

జుక్కల్‌లో 10న రేవంత్‌రెడ్డి యాత్ర

పిట్లం: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఈనెల 10న జుక్కల్ నియోజకవర్గంలో నిర్వహిస్తామని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ తెలిపారు. ఆయన మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో వాయిదా పడ్డ యాత్ర ఈనెల 10న నియోజకవర్గ ఇన్‌చార్జి సౌదాగర్ గంగారాం ఆధ్వర్యంలో కొనసాగుతుందన్నారు. టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాలు లీకైతే ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జోడో యాత్రను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. హనుమాన్ జయంతి సందర్భంగా బజరంగ్‌దళ్ కమిటీకి రూ. 11 వేల విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, గంగా సంఘమేశ్వర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గడుగు గంగాధర్

క్లుప్తంగా

7న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7న శుక్రవారం ఉదయం 7 గంటలకే స్థానిక ఇందిరా గాంధీ స్టేడియంలో జిల్లాస్థాయి ఫెడరేషన్ అండర్-20 మెన్, ఉమెన్ అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు అథ్లెటిక్స్ డ్రెస్ కోడ్ పాటించాలన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా వయస్సు ధ్రువీకరణ కోసం ఎస్సీసీ మార్కుల జాబితా లేదా, బోనాఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు.

రేపు ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నిజామాబాద్ సిటీ : ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌ఏ (ఎఫ్) ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గురువారం తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో హాజరు కావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం మంగళవారం ప్రకటనలో తెలిపారు.

సాఫ్ట్‌బాల్ టోర్నీలో మిట్టాపల్లి క్రీడాకారుల ప్రతిభ



డిచ్‌పల్లి : ఈనెల 2న సుద్దపల్లి గురుకుల పాఠశాలలో జరిగిన మినీ సబ్ జూనియర్ జిల్లా సాఫ్ట్ బాల్ టోర్నీలో మిట్టపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఫైనల్‌లో ఆర్మూర్ గురుకుల పాఠశాల జట్టుతో హోరాహోరీగా పోరాడి 05–06 తేడాతో ఓటమిపాలై ద్వితీయస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, పీడీ మర్కంటి గంగా మోహన్‌ను సర్పంచ్ తేలు గణేష్, ఎంపీటీసీ బాలగంగాధర్, మిట్టాపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం రాఘవేంద్రరావు, పాఠశాల చైర్మన్ భాస్కర్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం విజేత, టీఆర్‌ఎస్ నాయకులు ఒడ్డం నరసయ్య, గోపు రాజేశ్వర్, ఎస్.కె జుబేర్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, మమత , రమాదేవి అభినందించారు.

ఇఫ్తార్‌లో స్పీకర్ పోచారం



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని దుర్కిలో రంజాన్ ఉపవాసాలను పురస్కరించుకుని మైనారిటీలు నిర్వహించిన ఇఫ్తార్ విందులో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీపీ పాల్త్య విఠల్, బాన్సువాడ నియోజక వర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, సర్పంచ్ శ్యామల, పీఏసీయస్ చైర్మన్ డి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ కిషోర్ యాదవ్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మాజీద్ ఖాన్, నాయకులు గడుగు శంకర్ తదితరులున్నారు.

చి'వరి'కి దొంగ దెబ్బ..!

- చోరీకి గురవుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- ఎండిపోయే స్థితిలో వరి
- పదిరోజుల వరకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వని అధికారులు
- ఆందోళనలో అన్నదాత



వెల్కటూర్ శివారులో దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

బాల్కొండ: మెండోరా మండలం వెల్కటూర్ శివారులో సాగుచేసిన వరిపంట మరో పదిరోజుల్లో చేతికందుతుందని ఆశపడ్డ రైతులపై ట్రాన్స్‌పార్మర్ల చోరీ దుండగులు నీళ్లు చల్లారు. ట్రాన్స్‌పార్మర్లలో కాపర్, ఆయిల్ ఎత్తుకెళ్లడంతో కరెంటు లేక పొలాలు ఎండిపోయే పరిస్థితి తయారైంది. కాకతీయ కాలువ వెంబడి ఏడు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. అనంతరం వాటిలోని కాపర్, విలువైన ఆయిల్‌ను చోరీ చేశారు. దీంతో రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు 6, 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి ఎత్తుకెళ్లారు. ఈ ట్రాన్స్‌పార్మర్ల ద్వారా సుమారుగా 60 ఎకరాల్లో వరి పంటకు నీరందుతోంది. ప్రస్తుతం వరి పంట విత్తు పోసుకునే చివరి దశలో ఉంది. మరోవారం రోజులు నీరు అందితే పంట విత్తు పూర్తిగా ముదిరి పంట చేతికందుతుంది. కాని ప్రస్తుతం విద్యుత్ సరఫరా లేకపోవడంతో నీటి సరఫరా జరిగే అవకాశం లేదు. ఎత్తుకెళ్లిన ట్రాన్స్‌పార్మర్లపై ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత వాటి ఆధారంగా ట్రాన్స్‌కో ఉన్నత అధికారులు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల మంజూరు చేస్తారు.

ఇదంతా రైతులు దగ్గరుండి సొంత ఖర్చులతో ధ్వంసం చేసిన ట్రాన్స్‌పార్మర్లను డివిజన్ కార్యాలయానికి తీసుకెళ్లి, అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేస్తే తప్ప ట్రాన్స్‌పార్మర్లు మంజూరయ్యే అవకాశం లేదు. అంతలోపు చేతికందాల్సిన వరి పంట ఎండిపోయి బూడిద పాలయ్యే ప్రమాదం ఉంది. పాలకులు ఉన్నతాధికారులు స్పందించి వెంటనే విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను మంజూరు చేయాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

ట్రాన్స్‌ఫార్మర్లు దుండగులు ఎత్తుకెళ్లడంలో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంపై రైతులు మండిపడుతున్నారు. ట్రాన్స్‌పార్మర్లపై ఎలాంటి నిఘా ఏర్పాటుకు సూచనలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా లైన్‌మెన్‌లు స్థానికంగా ఉండకపోవడం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. గ్రామాల్లో లైన్‌మెన్‌లు స్థానికంగా ఉండకుండా, గ్రామానికి చెందిన మెకానిక్‌పై ఆధారపడి పనులు చేపిస్తున్నారు. దీంతో ఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తుకెళ్లే ప్రమాదం ఉందో గుర్తించడంలో విఫలమవుతున్నారు. ఉన్నత అధికారులు స్పందించి ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఇనుప చువ్వలతో భద్రత ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలోనే మంజూరు చేస్తాం

దుండగులు ఎత్తుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను వారం, పది రోజుల్లో మంజూరు చేస్తాం. రైతులు గస్తీ తిరగాలని ఇదివరకే సూచించాం. భవిష్యత్తులో ఇలాంటి జరగకుండ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం. – మహ్మద్ అంజత్ పాషా, ట్రాన్స్‌కో ఏఈ, మెండోరా

పేపర్ లీకేజీ దోషులను తప్పిస్తున్నారు



కామారెడ్డిలో యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తున్న కార్యకర్తలు

కామారెడ్డి టౌన్ : రాష్ట్రంలో ప్రశ్నపత్రాలు పరీక్ష పేపర్ లీకేజీల దోషులను తప్పించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చందు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కోర్టు రోడ్డులో నిరుద్యోగులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 రోజులుగా ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్‌ల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతుంటే ప్రభుత్వం దోషులను తప్పించే ప్రయత్నం చేయడమే కాకుండా, తమపై అక్రమ కేసులను బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, మంత్రి వర్గం నుంచి మంత్రి కేటీఆర్‌ను భర్తరఫ్ చేయాలని, కమిషన్ పాలక మండలిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీపై సాక్షాధారాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డికి ఈడీ నోటీసులు పంపిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, ప్రవీణ్, బూక్యా రాజు, తుడుం జీవన్, సోఫియాన్, శ్రీధర్, నందు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మకు ఉరివేసి..



కామారెడ్డి టౌన్ : రాష్ట్రంలో వరుసగా పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం కొత్త బస్టాండ్ ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మకు ఉరివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి చరణ్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ, గ్రూప్స్ పరీక్షా పత్రాలతో పాటు ప్రస్తుతం పదోతరగతి పరీక్షల పత్రపత్రాలు లీకేజీలు పాల్పడం ప్రభుత్వం నిర్లక్ష్యమేనన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సంబంధిత మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందుర్ విభాగ్ వసతి గృహాల కన్వీనర్ పోతరాజు లక్ష్మణ్, జోనల్ ఇన్‌చార్జి సాయి చరణ్, నాయకులు ఖలీల్, రాజు, సాయి, మహేశ్ పాల్గొన్నారు.

పెట్రోల్‌లో నీళ్లు..

- ఆందోళనకు దిగిన వాహనదారులు
- రామారెడ్డి హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో ఘటన

రామారెడ్డి(ఎల్లారెడ్డి) : పెట్రోల్‌లో నీళ్లు రావడంతో వాహనదారులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన రామారెడ్డి మండల కేంద్రం హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో మంగళవారం జరిగింది. ఓ వాహనదారుడు వాటర్ బాటిల్‌లో లీటర్ పెట్రోల్ కోసం రాగా బంక్ సిబ్బంది బాటిల్‌లో పెట్రోల్ నింపారు. అయితే బాటిల్ 15శాతానికి పైగా నీళ్లు కనిపించడంతో వాహనదారుడు అవాక్కయ్యాడు. మరికొంత మంది వాహనదారులు పెట్రోల్‌లో నీళ్లను చూసి ఆందోళనకు దిగారు. గతంలోనూ ఈ పెట్రోల్ బంక్‌లో నీళ్లు వచ్చాయని, అయినా వీరి మారట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మను 'సాక్షి' వివరణ కోరగా పెట్రోల్ బంక్ యజమానుల నిర్లక్ష్యం నిర్వహణ లోపం కారణంగానే ఇలా జరుగుతోందని సదరు పెట్రోల్‌బంక్‌లో తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



పెట్రోల్‌లో వచ్చిన నీళ్లు

కొనసాగుతున్న బోదకాలు గుర్తింపు సర్వే

- 59 పాఠశాలల్లో 1,692 మంది విద్యార్థులకు పరీక్షలు
- నలుగురికి బోదకాలు వచ్చే అవకాశాలున్నట్లు నిర్ధారణ



నగరంలో బోదకాలు సర్వేను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం

నిజామాబాద్ సిటీ : కేంద్ర ప్రభుత్వం బోదకాలు గుర్తించేందుకు మూడవ విడత సర్వే(ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంట్ సర్వే) జిల్లాలో కొనసాగుతోంది. గత నెల మార్చి 31 నుంచి మొదలుకాగా ఈనెల 7వ తేదీ వరకు కొనసాగనుంది. జిల్లావ్యాప్తంగా 49 పాఠశాలలో ఈ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. ఎక్కడైనా సర్వేకు ఇబ్బంది తలెత్తితే అదనంగా మరో 10 పాఠశాలలను ముందస్తుగా ఎంపిక చేసి ఉంచారు. మొత్తం 1692 మంది విద్యార్థులకు రక్త పరీక్షల ద్వారా బోదకాలు ఉందా లేదా అనేది గుర్తించనున్నారు. దీనికిగాను జిల్లావ్యాప్తంగా మొత్తం 10 వైద్య బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్‌ఎం, ఇద్దరు ఆశ కార్యకర్తలను నియమిచారు. బోదకాలు పరీక్షలు చేసేందుకు వీరిందరూ గత నెల మార్చి 24న జిల్లా కేంద్రంలో శిక్షణ పొందారు. ఈ బృందం క్షేత్రస్థాయిలో రక్త పరీక్షలు చేసి 10 నిమిషాలోనే విద్యార్థులలో బోదకాలు క్రిమి ఉందా లేదా అనేది గుర్తించి బోదకాలు క్రిమి ఉంటే వారికి వైద్యం, మందులు పంపిణీ చేస్తున్నారు. ఎంపిక చేసిన పాఠశాలలో ఆరు, ఏడేళ్ల పిల్లలకు మాత్రమే పరీక్షలు చేస్తున్నారు. మంగళవారం నాటికి జిల్లాలో 30 పాఠశాలలో సుమారు 1200 మంది విద్యార్థులకు పరీక్షలు పూర్తి చేశారు. ఈ పరీక్షలో నలుగురు విద్యార్థులకు బోదకాలు వచ్చే అవకాశాలు ఉన్నట్లుగా వైద్యులు గుర్తించారు. వారికి బోదకాలు నివారణకు చికిత్స అందించనున్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం నిత్యం జిల్లాలో ఈ సర్వే కొనసాగుతున్న తీరును పరిశీలిస్తున్నారు.

టీయూలో పలువురి పదవీకాలం పొడగింపు

తెయూ(డిచ్‌పల్లి) : తెయూలోని వివిధ విభాగాల్లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పదవీకాలాన్ని వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ ఆదేశాల మేరకు పొడిగించారు. ఏడాది పాటు వీరి పదవీకాలాన్ని పెంచినట్లు రిజిస్ట్రార్ ఆచార్య విద్యావర్ధిని ఉత్తర్వులు జారీచేశారు. పదవీకాలం పొడిగించిన వారిలో ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొ భ్రమరాంబిక, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, డైరెక్టర్, మైనార్టీ సెల్‌గా పనిచేస్తున్న అసోసియేట్ ప్రొ గుల్ ఈరానా, ఉమెన్ సెల్‌గా పనిచేస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ప్రొ ఆపర్ణ, గ్రీవెన్స్ సెల్‌గా పనిచేస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డా రాజేశ్వరి ఉన్నారు.

టీయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం

తెయూలో లా విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్నరాణిని డైరెక్టర్ లీగల్ సెల్‌గా, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్రవంతిని డైరెక్టర్, లీగల్ ఎయిడ్ క్లీనిక్‌గా వైస్‌చాన్సిలర్ ప్రొఫెసర్ రవీందర్ నియమించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని ఉత్తర్వులు జారీచేశారు.

ఓటర్ కార్డులో తప్పులు సవరించాలి



నిజామాబాద్ నాగారం : నగరంలోని ఓటర్‌కార్డుల్లో తప్పులను సవరించాలని, అలాగే డబుల్, త్రిబుల్ పేర్లు ఉంటే వెంటనే సరిచేయాలని చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి రవికిరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం బురుడుగల్లిలో ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. ఎక్కడైనా రెండు, మూడు సార్లు ఫొటో, పేరు వస్తే ఒక దగ్గర ఉంచి మిగితా చోట్ల తీసివేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఆరు వేలు, నగరంలో 1500 ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఓటర్ లిస్ట్‌లను పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ చిత్రమిశ్రా తదితరులున్నారు.

ఉద్యానక్షేత్రంలో మామిడి వేలం



మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలో మామిడి కాతకు వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలో మామిడితోట కాతకు బుధవారం అధికారులు వేలంపాట నిర్వహించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలంపాట జరిపారు. కాగా వేలంపాటలో 11మంది వ్యాపారులు పాల్గొనగా ఎల్లారెడ్డి మండలం మాచాపూర్‌కు చెందిన దాసరి పోచయ్య అత్యధికంగా రూ.1,79,000 పాడి కాతను దక్కించుకున్నాడు. వేలంపాటలో మాల్తుమ్మెద ఉద్యానక్షేత్ర అధికారి రామకృష్ణ తదితరులున్నారు.

జిల్లాలో ఆయిల్‌పాం సాగు లక్ష్యం పూర్తి

జిల్లాలో 2022–23కు సంబంధించి ఆయిల్ పాం సాగు లక్ష్యాన్ని పూర్తి చేశామని జిల్లా ఉద్యానశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో 2022–23కుగాను 800 ఎకరాల్లో ఆయిల్ పాం సాగుచేయాలని లక్ష్యంగా నిర్ణయించారని, ఈ మేరకు 250 మంది రైతుల పొలాలలో 800 ఎకరాల్లో ఆయిల్ పాం సాగు చేయించామన్నారు. ప్రస్తుతం ఆయిల పాం మొక్కలకు నల్లకొమ్మ పురుగు, రైనోసారస్ బిటిల్ తెగుళ్లు సోకుతున్నాయన్నారు. వీటి నివారణ కోసం రైతులకు తగు సూచనలు చేశామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.లక్షా70వేల బడ్జెట్‌ను కేటాయించిందన్నారు.

పల్లెపల్లెకు ఓబీసీ.. ఇంటింటికీ బీజేపీ

- ఈనెల 6 నుంచి 14 వరకు..
- నిజామాబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య



మాట్లాడుతున్న బస్వా లక్ష్మీనర్సయ్య

ఖలీల్‌వాడి : ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకు పల్లె పల్లెకు ఓబీసీ ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య తెలిపారు. మంగళవారం బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ పీఎం నరేంద్ర మోదీ బీసీలకు చేకూర్చిన ప్రయోజనాలు ప్రజలకు వివరించడానికి ఓబీసీ మోర్చా అధ్వర్యంలో కార్యక్రమం చేపట్టిందన్నారు. తెలంగాణకు చెందిన డాక్టర్ లక్ష్మణ్‌ను కేంద్ర ఓబీసీ అధ్యక్షుడిగా చేయడమే కాకుండా బీసీ వర్గానికి చెందిన బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్షున్ని చేసినట్లు చెప్పారు. బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసి దానికి చట్టబద్ధత కల్పించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 33 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను దాదాపు 10 శాతం తగ్గించి, 23 శాతంకు కుదించారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. రైతులకు రుణామాఫీ అమలు చేయాలేదన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చే వరకు ప్రతి కార్యకర్త ముందు ఉండి పని చేయాలన్నారు. ఓబీసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందన్ దివాకర్, ఓబీసీ మోర్చా జిల్లా ఇంఛార్జి గరిపే శ్రీనివాస్, యామాద్రి భాస్కర్, పాతన్ కర్ లక్ష్మి నారాయణ, స్వామి యాదవ్, శిలా శ్రీనివాస్, డమాంకర్ శ్రీనివాస్, కొడూరు నాగరాజు, నర్సింగ్ ముదిరాజ్, ఇప్పాకాయల కిషోర్, గిరిబాబు, రాజన్న పాల్గొన్నారు.

పట్టాపాస్ పుస్తకాలతో ధర్నా



సిరికొండ : మండలంలోని గడ్కోల్ గ్రామంలో పట్టాదారులు పాత పట్టా పాసు పుస్తకాలతో మంగళవారం ఆందోళన చేశారు. గ్రామ రెవెన్యూ శివారులో సర్వే నం. 100, 102లో 2005లో అప్పటి ప్రభుత్వం 160 మంది పేదలకు ఎకరం చొప్పున పట్టాలు ఇచ్చింది. ప్రస్తుతం వాటిని ధరణిలో నమోదు చేయకపోవడంతో పట్టాదారులు ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నామన్నారు.

భిక్కనూరులో చైన్ స్నాచింగ్



బాధితురాలు మల్లమ్మ

భిక్కనూరు : మండల కేంద్రంలో శ్రీ సిద్ధరామేశ్వర స్వామి ఆలయ కమాన్ సమీపంలో మంగళవారం సాయంత్రం చైన్‌స్నాచింగ్ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా వడియారం గ్రామానికి చెందిన కొనింటి మల్లమ్మ తన కుటుంబీకులతో కలిసి భిక్కనూరు ఎల్లమ్మ ఆలయం వద్ద వారి బంధువులు పండగ చేయడంతో ఉదయం వచ్చింది. పండగ అనంతరం ఆమె తిరిగి వడియారం వెళ్లేందుకు బస్సు ఎక్కేందుకు ఎల్లమ్మ ఆలయం వద్ద భర్త నర్సయ్యతో కలిసి నడుచుకుంటూ వెళ్తోంది. శ్రీ సిద్ధరామేశ్వర కమాన్ వద్దకు వస్తుండగా అకస్మాత్తుగా బైక్‌పై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వెనక నుంచి వచ్చి మల్లమ్మ మెడలో బంగారు పస్తెల తాడును లాగారు. దీంతో ఆమె కిందపడిపోగా వారు భార్యభర్తలిద్దరికీ కత్తి చూపించి మల్లమ్మ మెడలో చైన్‌ను తెంపుకుని పరారయ్యారు. విషయం తెలుసుకున్న భిక్కనూరు సీఐ తిరుపతయ్య సంఘటనాస్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించి దుండగుల కోసం గాలించారు.

క్రైం కార్నర్

కాలువలో పడి ఒకరి ఆత్మహత్య



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

రెంజల్(బోధన్): రెంజల్ మండల కేంద్రానికి చెందిన మల్లెపూల నడ్పి గంగాధర్(54) అనే వ్యక్తి కాలువలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం గ్రామ శివారులోని సాగర్ కాలువలో గుర్తు తెలియని మృతదేహం నీట మునిగి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఇంచార్జి ఎస్సై నారాయణసింగ్ సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని కాలువ నుండి బయటకు తీయించారు. కాలువ ఒడ్డును సైకిల్‌ను పార్కింగ్ చేసి బట్టలు, సెల్‌ఫోన్‌ను పక్కన పెట్టి కాలువపై ఉన్న చిన్న సిమెంట్ పోల్‌కు చేతి రుమాలుతో రెండు కాళ్లకు కట్టుకుని తాడు సాయంతో కాలువలో దిగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. గంట క్రితమే ఇంటి నుండి వెళ్లి కాలువలో శవమై తేలడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కుటుంబీలకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరిపై అనుమానంలేదని కుటుంబీకులు వివరించారు. భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించారు.



పాంగ్రా వాగులో పెరిగిన హైసింత్ పూలు



పువ్వు రెమ్మపై నెమలీక డిజైన్

కనువిందు చేస్తున్న హైసింత్ పూలు

నగరంలోని పాంగ్రా వాగులో గుర్రండెక్కకు పెరిగిన హైసింత్ పూలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వాగులో నీరు అడుగంటిపోవడంతో గుర్రపుడెక్క మొక్కలు మొత్తం వాగునంతా ఆక్రమించాయి. వాటికి పూసిన నీలి రంగు పువ్వులు పూలవనాన్ని తలపిస్తున్నాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



మృతి చెందిన బాబు

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన బందెల బాబు (42) లావణ్యలు భార్యభర్తలు. వీరికి కుమార్తె నికిత, కుమారుడు గణేశ్ ఉన్నారు. బాబు ముంబయిలో నివసిస్తాడు. ఇటీవల ముంబాయి నుంచి జంగంపల్లి గ్రామానికి వచ్చాడు. సోమవారం రాత్రి బందెల బాబు ఆయన భార్య లావణ్యతో ఎల్లారెడ్డి నుంచి వచ్చిన స్వామి అనే అనుమానాస్పద వ్యక్తి గొడవపడుతుండగా కుటుంబీకులు, స్థానికులు వెళ్లి సముదాయించారు. ఉదయం బాబు మృతి చెందాడని భార్య లావణ్య కాలనీవాసులకు తెలిపింది. దీంతో కాలనీవాసులు ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు మృతుని భార్య లావణ్యను ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన స్వామిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

చెరువులో పడి ఒకరు..

నస్రుల్లాబాద్(బీర్కూర్) : బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర పీరయ్య(37) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం చెరువులో నీరు పారపెట్టి వస్తానని వెళ్లి ఎంతకు రాకపోవడంతో మంగళవారం భార్య సావిత్రి కుంటుంబసభ్యులతో కలిసి పొలం పక్కనే ఉన్న చెరువు వద్ద చూడగా చెరువులో మృతదేహం కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. కాలకృత్యాలను తీర్చుకునేందుకు చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు పడిపోయి ఈతరాక ప్రాణాలు కోల్పోయినట్లు అనుమానిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి అరెస్టు

మాక్లూర్ : మండలంలోని మాణిక్‌భండార్‌కు చెందిన కెతావత్ రాజేశ్వరి (19) ఆత్మహత్యకు కారకుడైన అదే మండలానికి చెందిన అభిలాష్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ పేర్కొన్నారు. ఒకే తండాకు చెందిన రాజేశ్వరి, అభిలాష్ నాలుగేళ్లుగా ప్రేమించుకుని విడిపోయారు. ఐనప్పటికీ అభిలాష్ తరుచూ ఫోన్‌చేస్తూ వేధించటంతో తట్టుకోలేక రాజేశ్వరి మార్చి 23న రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. తొమ్మిదిరోజుల పాటు చికిత్స పొంది ఈనెల 1న మృతి చెందిన విషయం విదితమే. తల్లి అనూష ఫిర్యాదు మేరకు మాక్లూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అప్పటినుంచి తప్పించుకుని తిరుగుతున్న అభిలాష్‌ను మంగళవారం మాణిక్‌భండార్ చౌరస్తా వద్ద పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ పేర్కొన్నారు.